జిందగీ
చిత్రీ

నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 6 జనవరి 2025
www.ntnews.com

ఏకాగ్రతతోనే విజయం

గీతాసారం

వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకేహ కురునందన।
బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్॥
(భగవద్గీత 2-41)

'ఓ కురునందనా.. అర్జునా! ఎవరి బుద్ధి అయితే వ్యవసాయాత్మికమై, నిరంతర ప్రయత్నశీలమై ఒకే మార్గంలో లక్ష్యం వైపు కేంద్రీకరించిన దృష్టితో స్థిరంగా పయనిస్తుందో అతను ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ప్రపంచం మొత్తం తనకెదురుగా నిలిచినా తన సాధనా ప్రయత్నాన్ని విడువడు. ఎవరి బుద్ధి అనేక శాఖలుగా వ్యాప్తమై స్థిర సంకల్పాన్ని సాధించదో వారు దేనినీ సాధించలేరు' అంటాడు కృష్ణుడు.

వ్యవసాయాత్మకం అనడం వల్ల నిశ్చయమైనది అని భావం. సాధారణంగా మనసుగా ఉన్నది.. మనస్, బుద్ధి, అహంకారం, చిత్తముల పేర నాలుగు విధాలుగా వ్యవహరిస్తుంది. మనస్.. చంచలమై లోక వ్యవహారాలను నిర్వహిస్తుంది. బుద్ధి.. మంచి చెడులను వివేకంతో నిర్ణయిస్తుంది. అహంకారం.. నేనే అనే భావనను కలిగిస్తుంది. చిత్తం.. సంచిత కర్మఫలాలను అందిస్తుంది. పట్టుదలతో చేసే ప్రయత్నం కర్మఫలితాలనూ మారుస్తుంది. విచక్షణ జ్ఞానంతో మనసును బుద్ధి నడిపిస్తే.. కర్తవ్యాన్ని త్రికరణ శుద్ధిగా నిర్వహించడం జరుగుతుంది.

నేను, నావారు అనే భావనలకు పరిమితమైన బుద్ధి.. అహంకార మమకారాలకు ఆశ్రయమిస్తూ.. చంచలత్వాన్ని పొందుతుంది. నిరంతర సాధనవల్ల బుద్ధిని ఏకమార్గంలో ప్రవేశపెడితే.. అనేకత్వం ఏకత్వానికి మారుతుంది.. ఏకాగ్రతను సాధిస్తుంది. ఏ బాహ్య ప్రలోభాలకు, ఒత్తిడులకు లొంగకుండా తన కర్తవ్యాన్ని నిర్వహించడమే 'స్వధర్మం'. వ్యక్తి నిశ్చలమైన మనసుతో స్వధర్మాన్ని అనుష్ఠించాలి. గద్ద ఎంత ఎత్తులోనున్నా, భూమిపైనున్న తన లక్ష్యంపై ఎలాగైతే దృష్టి చెదరనీయదో.. అలాగే సాధకుడు కూడా తన లక్ష్యం నుంచి దూరంగా జరగకూడదు. అనునిత్యం తనను తాను ఆత్మావలోకనం చేసుకునే వ్యక్తి మనసు, వివిధ శాఖలుగా విస్తరించే అవకాశం తక్కువ.

తన జీవన ప్రయోజనం ఏమిటో తెలియని వ్యక్తి చిమ్మ చీకటిలో అడవిలో తిరుగుతున్నట్టుగా సంచరిస్తుంటాడు. లక్ష్యాన్ని నిర్దేశించుకున్న వ్యక్తి లక్ష్యం కేంద్రంగా తన మార్గాన్ని నిర్ణయించుకొని ఆ మార్గంలో పయనిస్తాడు. అయితే ప్రక్రియపై దృష్టిని పెట్టి నిశ్చితాభిప్రాయుడై నడిచే వ్యక్తి లక్ష్యానికి దగ్గరవుతాడు. అలాకాని నాడు వ్యగ్రమైన మనసు చంచలత్వాన్ని ఆశ్రయించి అనేకమై, ఫలితాపేక్షతో ఒత్తిడికి లోనై, తెగిన గాలిపటంలా గమ్యహీనమైన మార్గంలో తిరుగుతూ అపజయాన్ని పొందుతాడు.

మనో నియంత్రణ లేని వ్యక్తి తన చుట్టూ జరుగుతున్న దానిని కూడా గ్రహించలేక నిర్వహణా లోపం వల్ల అపజయాన్ని మూటగట్టుకోవడమే కాక.. ఇతరులు పన్నిన వలలో పడిపోతాడు. నిర్ణయాత్మకమైన ఉన్నత పదవిలో.. మనసుపై అదుపులేని, అనుభవం అర్హతలులేని వ్యక్తులు కూర్చొని హానికరమైన నిర్ణయాలు తీసుకుంటే.. సంస్థలు నిర్వీర్యమవుతాయి. అలాగే ప్రలోభాలకు లోనైన వ్యక్తి నిర్ణయాలూ వ్యవస్థను అవస్థలపాలు చేస్తాయి. ఇలాంటివారు.. తమ అసమర్థతను ఇతరులపై నెట్టివేయడం వల్ల ఆ సంస్థతోపాటు దానిపై ఆధారపడిన వారంతా బాధపడాల్సి వస్తుంది. అందుకని నాయకుడు.. తన మనసును ఏకీకృతం చేసి, దృఢదీక్షతో కర్తవ్యాన్ని నిర్వహించాలి. అప్పుడే వ్యక్తిగతమైన పురోగతి.. సామాజిక అభ్యున్నతి సాధ్యపడుతుంది.

... పాలకుర్తి రామమూర్తి

శుక్రవారం
వైకుంఠ ఏకాదశి

ముక్కోటి వైభవం

ధనుర్మాస సంతసాన్ని రెట్టింపు చేసే పర్వం వైకుంఠ ఏకాదశి. దక్షిణాయనంలో యోగనిద్రలో ఉన్న మహావిష్ణువు ఈ రోజే మేల్కొంటాడని శాస్త్రం చెబుతున్నది. స్థితికారుడైన శ్రీహరిని మేల్కొల్పడానికీ, ఆ స్వామిని దర్శించుకోవడానికి ముక్కోటి దేవతలూ వైకుంఠానికి తరలివెళ్తారు. ఉత్తర ద్వారం నుంచి పురుషోత్తముణ్ని దర్శించుకొని ఉప్పొంగిపోతారు. దేవతలే కాదు.. ఇలాతలంలో మనుషులు కూడా వైష్ణవాలయాలకు పోటెత్తుతారు. ఉత్తర ద్వారం గుండా వెళ్లి విష్ణుమూర్తి విశేష రూపాన్ని చూసి జన్మ తరించిందన్న భావనకు లోనవుతారు.

ఏడాదిలో వచ్చే అన్ని ఏకాదశులూ ఏదో ఒక ప్రత్యేకతను సంతరించుకున్నవే! ముక్కోటి ఏకాదశి కూడా విశేషమైనదే. అయితే, ప్రతి ఏకాదశినీ చాంద్రమానం అనుసరించి చేసుకుంటాం. ముక్కోటి ఏకాదశిని మాత్రం సౌరమానం ప్రకారం జరుపుకొంటాం. సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశించిన తర్వాత వచ్చే శుక్ల ఏకాదశిని 'వైకుంఠ ఏకాదశి'గా చేసుకోవాలని శాస్త్రం నిర్దేశించింది. అందుకే ఈ పర్వం ఒక్కోసారి మార్గశిర మాసంలో, ఒక్కోసారి పుష్యమాసంలో వస్తుంటుంది. ముక్కోటి దేవతలు వైకుంఠ ద్వారంలో మహావిష్ణువును దర్శించుకుంటారు కాబట్టి దీనిని 'ముక్కోటి ఏకాదశి' అని కూడా పిలుస్తారు. ముందుగా దేవతలకు దర్శనమిచ్చిన శ్రీహరి... ఉత్తర ద్వారం ద్వారానే ప్రయాణించి భూలోకానికి వచ్చాడనీ, మురాసురుడు అనే రాక్షసుణ్ని సంహరించాడని పురాణ కథనం.

ముక్కోటి ఏకాదశి నాడు వేకువ జామునే నిద్ర లేవాలి. అవకాశం ఉన్నవాళ్లు నదీస్నానం చేయాలని పెద్దల మాట. లేనిపక్షంలో అభ్యంగన స్నానం ఆచరించి.. వైష్ణవాలయానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకోవాలి. శారీరకంగా ఆరోగ్యం సహకరించిన వారు ఆనాడు పూర్తి ఉపవాసం పాటించాలి. వీలైనంత ఎక్కువ సమయం విష్ణు చింతనలో కాలం గడపాలి. విష్ణుకథలు వినడం, విష్ణునామాన్ని సంకీర్తనం చేస్తూ మనసును దైవానికి సమీపంగా ఉంచే ప్రయత్నం చేయాలి. మర్నాడు ఉదయం విష్ణుపూజ చేసి, అతిథికి భోజనం పెట్టి, ద్వాదశి పారణం (భోజనం) చేయాలి.

ఉత్తమ దర్శనం

దేవతలకు ఉత్తరాయణం పగటి సమయంగా, దక్షిణాయనం రాత్రివేళగా పేర్కొంటారు. ఉత్తర-దక్షిణాయనాలకు సంధిలో వచ్చే ధనుర్మాసం దేవతలకు బ్రాహ్మీ సమయంగా అభివర్ణిస్తారు. ఈ బ్రాహ్మీ ముహూర్తంలో వచ్చే శుక్ల ఏకాదశి అత్యంత పవిత్రమైనది. ఆ రోజు దేవతలంతా వైకుంఠానికి వెళ్లి ఉత్తర ద్వారం నుంచి వైకుంఠనాథుడిని దర్శనం చేసుకుంటారు. ఈ నేపథ్యంలో శ్రీమహావిష్ణువు అనుగ్రహాన్ని పొందడం కోసం వైష్ణవ ఆలయాల్లో వైకుంఠంతో సమానమైన రత్న మందిరాన్ని నిర్మించి, ఉత్తర దిక్కుగా స్వామిని దర్శించి తరిస్తారు.

మనకు ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, ఆపై మనసును పదకొండో ఇంద్రియంగా చెప్పారు పెద్దలు. ఈ ఏకాదశ ఇంద్రియాలూ మంచి మార్గంలో ప్రవర్తించడం 'వైకుంఠ ఏకాదశి' లక్ష్యం. 'కుంఠం' అంటే లోపం. ఏ లోపం లేకుండా ఉండటం అంటే 'వికుంఠం'. అంటే సక్రమంగా వ్యవహరించటం. పదకొండు ఇంద్రియాలకు వికుంఠ స్థితిని ప్రసాదించే పర్వదినం వైకుంఠ ఏకాదశి. మనసు, ఇంద్రియాలూ, వీటి ప్రవృత్తులు కోటాను కోట్లు. ఆ మనసు సత్వ, రజ, స్తమో గుణాల ప్రకారం పనిచేస్తుంది. ఆ ప్రవృత్తులను ముక్కోటి దేవతలుగా సంకేతరూపంలో చెప్పారు పెద్దలు. ఈ ప్రవృత్తులన్నీ 'ఉత్తర' ద్వారం వెంబడి ప్రయాణించడం అంటే 'యోగసాధన' అని అర్థం. అలా యోగసాధన సక్రమంగా సాగినప్పుడు కలిగే దివ్యానందమే హృదయంలో కలిగే విష్ణు దర్శనం. ఆనాడు జీవుడి మనః ప్రవృత్తులు ఉన్న మార్గం కన్నా ఉన్నతమైన మార్గంలో ప్రయాణిస్తాయి. అదే ఉత్-తర-ద్వార దర్శనం. ఈ అంతరార్థాన్ని గమనించి ప్రవర్తించిన వేళ ఈ వైకుంఠ ఏకాదశి పర్వదినం మొక్కుబడిగా మిగిలిపోక సార్థకం అవుతుంది.

విష్ణు రూపం

ఏకాదశి శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన తిథిగా చెబుతారు. పూర్వం మురు అనే రాక్షసుడితో విష్ణుమూర్తి యుద్ధం చేశాడు. యుద్ధ సమయంలో అలసిపోయిన విష్ణువు కాసేపు నిద్రిస్తాడు. ఇదే అదునుగా విష్ణువును సంహరించడానికి మురాసురుడు ప్రయత్నిస్తాడు. అప్పుడు విష్ణువు దేహం నుంచి ఓ దివ్యతేజస్సు ఆవిర్భవించి, ఆ రాక్షసుణ్ని సంహరిస్తుంది. ఆ రోజు ఏకాదశి కావడంతో, విష్ణుమూర్తి తన తేజస్సును ఏకాదశి అని సంబోధించాడు. తన దేహం నుంచి ఉద్భవించి తనను రక్షించిన ఏకాదశితో మహావిష్ణువు.. 'మమ భక్తాశ్చ యే లోకాః తవ భక్తాశ్చ యే నరాః త్రిషు లోకేషు విఖ్యాతాః ప్రాప్స్యంతి మమ సన్నిధిం' అంటాడు. అంటే ఎవరు తనను, ఏకాదశీ దేవిని ఆరాధిస్తారో వాళ్లు ముల్లోకాల్లో కీర్తిని, చివరగా మోక్షాన్ని పొందుతారని వరం ఇస్తాడు. ఏకాదశిని ఆరాధించడం అంటే, ఆ రోజున ఉపవాసం ఆచరించి, భగవత్ ధ్యానంలో సమయం గడపడమే!

... శ్రీ భారతి

మనసంతో ప్రయత్నం

కథాసుధ

ఓ గ్రామంలోని రైతుకు పాటలు పాడుతూ భజనలు చేయడమంటే చాలా ఇష్టం. అయితే అతనెప్పుడూ ఊళ్లో జరిగే భజనల్లో పాల్గొనే వాడు కాదు. గ్రామస్తులు ఎవరైనా భజన చేస్తూ ఉంటే దూరంగా నిల్చుని వింటూ ఆనందించే వాడు. ఈ విషయాన్ని భజన బృందం నాయకుడు గమనించాడు. ఒక పౌర్ణమి నాడు ఊళ్లో రాములవారి గుడి దగ్గర జరుగుతున్న భజనకు రైతు కూడా వచ్చాడు. తన్మయత్వంతో కళ్లు మూసుకుని కూర్చున్న రైతుతో, భజన బృందం నాయకుడు 'నువ్వు కూడా పాటలు నేర్చి భజనలో పాల్గొనవచ్చు కదా' అని అడిగాడు.

'నాకు భజన చేయడమంటే చాలా ఇష్టం. భజనలో పాల్గొనడం అంటే మరీ ఇష్టం. కానీ, దేవుడే ఆ విషయం మరిచాడు. నాకు భజనలంటే ఇష్టమని దేవుడికి తెలిసి ఉంటుంది కదా. ఎందుకనో దేవుడు నన్ను భజనలు చేసే వైపు తీసుకెళ్ల లేదు' అన్నాడు.

రైతు మాటలకు బృంద నాయకుడు చిన్నగా నవ్వి 'మీ ఇంట్లో ఆవులు ఉన్నాయా?' అని అడిగాడు.

'లేకేమి, దండిగా ఉన్నాయి' అని బదులిచ్చాడు రైతు.

'నీ ఆవుల మందలో, ఏ ఆవు అయినా నువ్వు ఇంట్లో ఉంటే... దగ్గరికి వచ్చి తనకు తానుగా నీకు పాలు ఇచ్చిందా?' అని అడిగాడు.

'అదెలా ఇస్తుంది? ఇవ్వదు గాక ఇవ్వదు' అని గట్టిగా సమాధానం ఇచ్చాడు రైతు.

'ఇది కూడా అంతే. దేనికైనా మన ప్రయత్నం మనం చేయాలి. ప్రయత్నిస్తేనే ఫలితం ఉంటుంది. అన్నీ దేవుడే చేస్తాడు అనుకుంటే జరుగదు. ఎంత మంచి ఆవు అయినా తనకు తానుగా వచ్చి మనకు పాలు ఇవ్వదు. మనం ఆవు దగ్గరికి పోకుండా, పాలు పితక్కుండా ఇంట్లోనే కూర్చుంటే పాలు మన దగ్గరికి రావు. ఆవుకు మంచి ఆహారం, గడ్డి, నీళ్లు పెట్టాలి. పాలు పిండే ముందు దూడను ఆవు దగ్గరికి పంపాలి. దూడ కొన్ని పాలు తాగాక మిగిలిన పాలు పితకడానికి మనం దాని దగ్గరికి వెళ్లాలి. అంతేకాదు, అది తన్నే ఆవు అయితే వెనుక కాళ్లను తాడుతో కట్టి పాలు పితకాలి. మనం చేసేది చేస్తూ దైవ సహాయం తీసుకుంటే మరింతగా ఎదుగుతాం. కాబట్టి నువ్వు ఆలస్యం చేయకుండా మా భజన బృందంలో చేరు. భక్తుల్లో ఆధ్యాత్మిక భావం పెంచు' అని సలహా ఇచ్చాడు.

'నిజమే.. మనవంతు ప్రయత్నం లేకుండా.. ఏదీ జరగదు' అని గుర్తించిన రైతు చిన్నగా భజన బృందం వైపు నడిచాడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు, 93936 62821



మార్పు తెచ్చే నమాజ్

ఇస్లాం బోధ

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ పరిపాలనా కాలమది. ఒక యువతి రోజూ నమాజు కోసం మదీనా నగరంలో ప్రవక్త పేరుతో ఉన్న మస్జిదె నబవీకి వెళ్లేది. దారి మధ్యలో రోజూ ఓ యువకుడు ఆ యువతి కోసం కాపుగాసి ఉండేవాడు. ఆ అమ్మాయి నమాజుకు వెళుతుంటే అడ్డుతగిలేవాడు. ఆ పోకిరి చూపులు ఆ అమ్మాయిని ఇబ్బందిపెట్టేవి. ఓ రోజెలాగైనా అతనికి బుద్ధి చెప్పాల్సిందేనని భావించిందామె. రోజులాగే దారి మధ్యలో ఆ యువకుడు అడ్డుపడ్డాడు. 'రోజూ ఎందుకిలా అడ్డుతగులుతున్నావు?' అని నిలదీసింది యువతి. 'నాకు నువ్వంటే ప్రాణం. నువ్వు నా సొంతం అయ్యే వరకూ నిన్ను వదిలేదు లేదు. నీకోసం ఏమైనా చేస్తాను' అని ప్రాధేయపడ్డాడు. దానికా యువతి 'సరే నువ్వింతగా నా మీద మనసుపడ్డావు కాబట్టి నేను నీ సొంతం కావాలంటే ఒక షరతు. దానికి అంగీకారమైతే నన్ను నేను.. నీకు అర్పించుకుంటాను' అన్నది. యువకుడిలో ప్రాణం లేచివచ్చినట్టయింది. 'నీకోసం ఎంతకైనా తెగిస్తాను! ఏం చేయాలో చెప్పు' అని ఆమెను అడిగాడు.

అప్పుడు ఆ యువతి 'ఓ నలభై రోజుల దాకా ఖలీఫా ఉమర్ (రజి) వెనుక నమాజ్ చేయి. నలభయ్యో రోజు నేను నీకోసం ఎదురుచూస్తుంటాను' అని చెప్పి వెళ్లిపోయింది. అదేమంత కష్టమైన పని అనిపించలేదు ఆ యువకుడికి. ఇక ఆమె తనకు దక్కినట్టేనని భావించి అక్కడినుంచి వెనుదిరిగాడు. మర్నాటి నుంచి ఖలీఫా ఉమర్ (రజి) వెనుక నమాజులు చేయడం ప్రారంభించాడు. ఖలీఫా ఉమర్ (రజి) ఖురాన్ పారాయణం రోజూ ఆ యువకుడిలో మార్పు తీసుకురాసాగింది. నలభయ్యో రోజు రానే వచ్చింది. మాటప్రకారం ఆ యువతి దారి మధ్యలో యువకుడి కోసం నిరీక్షించసాగింది. ఆ యువకుడు మసీదు నుంచి వస్తూ ఆ అమ్మాయి వంక కన్నెత్తి కూడా చూడకుండా వెళ్లిపోసాగాడు. ఆ అమ్మాయి అతణ్ని పలకరించి 'నీకిచ్చిన మాట ప్రకారం నీ కోసమే ఎదురుచూస్తున్నాను' అన్నది. దానికా యువకుడు 'నువ్వు నిశ్చింతగా నిలబడు. నమాజులో ఖలీఫా ఉమర్ ఖురాన్ పారాయణం నా మనసును మార్చివేసింది. ఇప్పుడు నా మనసులో దైవప్రేమకు తప్ప మరెవ్వరి ప్రేమకు చోటు లేదు' అని చెప్పి అక్కడి నుంచి ఆ యువకుడు కనుమరుగైపోయాడు. ఆ యువకుడిలో వచ్చిన మార్పునకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెప్పిందామె!



నమాజ్ చెడు పనుల నుంచి వారిస్తుంది అని ఖురాన్ బోధనకు ఈ సంఘటన మచ్చుతునక. నమాజు అల్లాహ్‌ను జ్ఞాపకం ఉంచుకునే గొప్ప సాధనం. నిబద్ధతతో చేసే నమాజు వల్ల అల్లాహ్ ప్రేమ మనసులో నాటుకుంటుంది. తద్వారా మనసులో కల్మషాలన్నీ దూరమవుతాయి. నమాజులు చేస్తున్నప్పటికీ మనలో ఎలాంటి మార్పూ రావడం లేదంటే ఏదో మొక్కుబడిగా చేస్తున్నామని అర్థం. మన నమాజుల్లో ఏదో లోపం ఉందన్న విషయాన్ని గుర్తెరగాలి. ఎవరి నమాజు సరిగా లేదో అలాంటి వారు కష్టాల్లో ఉన్నట్టే అంటారు ప్రవక్త (స). క్రమం తప్పకుండా మందులు వాడినంత మాత్రాన వచ్చిన రోగం నయమవ్వదు, వైద్యుడు చెప్పిన పథ్యం పాటిస్తేనే ఔషధం గుణం చూపిస్తుంది. అదే విధంగా ప్రవక్త ముహమ్మద్ (స) ఏ విధంగా నమాజు చేయమని చెప్పారో అదే విధంగా చేయాలి. గుండె నిండా అల్లాహ్ ప్రేమను నింపుకొని నమాజు చేయాలి. అల్లాహ్ నన్ను చూస్తున్నాడు అనే స్పృహ కలిగి ఉండాలని ప్రవక్త సూచించారు. శ్రద్ధాభక్తులతో నమాజు చేసేవారే పరలోకంలో సాఫల్యం చెందుతారని ఖురాన్ బోధ.

.. ముహమ్మద్ ముజాహిద్, 96406 22076

క్రీస్తు సందేశం

పిల్లలను ఆపొద్దు

రోజూ క్రీస్తును దర్శించడానికి ఎంతోమంది ప్రజలు వచ్చేవారు. చాలామంది తమ వెంట పిల్లలనూ తీసుకొచ్చేవారు. కారణం.. ప్రభువు పిల్లలను చూసి తమను దగ్గరికి ఆహ్వానిస్తాడని, దీవిస్తాడని, కొన్ని మంచి మాటలు చెబుతాడని తల్లిదండ్రుల తాపత్రయం. అయితే, ప్రభువు అనుయాయులు కొందరు పిల్లలతో వచ్చేవారిని అసహనంగా చూసేవారు. 'క్రీస్తు బోధనలు పిల్లలకు అర్థం కావు' అంటూ కోప్పడేవారు. దీంతో ఆ తల్లిదండ్రులు బాధతో వెనుదిరిగేవారు. శిష్యుల ప్రవర్తన ఒకసారి ప్రభువు కంటపడింది. వారితో 'పిల్లలను నా దగ్గరకు రాకుండా అడ్డగించకండి. వారిని ఆశీర్వదిస్తాను. పెద్దలను పరామర్శించినట్లే.. చిన్నపిల్లలకూ నాలుగు మంచి మాటలు చెబుతాను. ఆ చిన్నారులను ఆహ్వానించండి. ప్రేమ, నమ్మకం నిండుగా ఉన్నవాళ్లే.. దేవుని రాజ్యంలోకి ప్రవేశిస్తారు. పిల్లల మాదిరిగా వినయశీలురై ఉన్నవారికే అది సాధ్యమవుతుంది. నేర్చుకోవడానికి పిల్లల్లా కుతూహలం చూపాల'న్నారు ప్రభువు.

... సునీల్ రాజు

ఉపనిషత్ వాక్యం

చదివితే చాలదు

గ్రంథ మభ్యస్య మేధావీ జ్ఞాన విజ్ఞాన తత్పరః
పలాలమివ ధాన్యార్థీ త్యజేత్ గ్రంథ మశేషతః
(అమృతబిందు ఉపనిషత్తు)

'మేధావి అయినవాడు వేద శాస్త్రాలను నేర్చుకొని, జ్ఞాన విజ్ఞానాల పట్ల మంచి ప్రయత్నం కలవాడై ఉండాలి. ధాన్యాన్ని కోరేవాడు పొట్టును వదిలిపెట్టి బియ్యాన్ని తీసుకునేటట్టుగా వేద శాస్త్రాలను అన్నిటిని విడిచిపెట్టాలి...' అని భావం. అంటే జ్ఞానాన్ని స్వీకరించి భద్రపరుచుకుని, పుస్తకాల మీద వ్యామోహాన్ని వదిలి పెట్టాలి అని శ్లోక తాత్పర్యం. ఈ భావాన్ని ప్రతిబింబించే కథను రామకృష్ణ పరమహంస ఇలా ప్రవచించారు.

'ఒక వ్యక్తికి ఒక ఉత్తరం వచ్చింది. అందులో అతని బంధువు కొన్ని వస్తువులు కొని పంపమని రాశాడు. ఉత్తరం చదివిన వ్యక్తి వాటిని తీసుకువద్దామని బజారుకు బయల్దేరాడు. కానీ, ఉత్తరాన్ని ఎక్కడో పెట్టి మరచిపోయాడు. వస్తువుల వివరాలూ గుర్తు లేవు. ఉత్తరం కోసం ఆత్రుతగా వెతికాడు. ఇంట్లో వాళ్లూ వెతికారు. ఆఖరికి ఒకచోట ఉత్తరం దొరికింది. హమ్మయ్య అనుకుంటూ ఆనందించాడు. మళ్లీ గబగబా చదివాడు. 5 సేర్ల మిఠాయి, ఒక వస్త్రం, ఇంకా ఏవో వస్తువులు పంపమని అందులో రాసి ఉంది. చెయ్యవలసిన పని తెలిసిపోయింది. ఇక బజారుకు వెళ్లి సేకరించి పంపడమే!' ఈ కథను శశిధర పండితుడికి, గిరీశ్‌చంద్ర ఘోష్‌కు చెప్పిన రామకృష్ణులు 'శాస్త్రాలలో భగవంతుణ్ని దర్శించే మార్గం మాత్రమే చెబుతారు. అది తెలుసుకున్న తరువాత అతణ్ని పొందడానికి సాధన చేయాలి. గమ్యం చేరాలి. అంతే కాని, కేవలం పాండిత్యం వల్ల ఏం ప్రయోజనం? పుస్తకాలు కంఠస్థం చేయడం, చెప్పడం.. అంతేనా! మనసు లోపల కామినీ కాంచనాల కోసం ఆరాటం. దీనివల్ల తరించిపోవడం జరుగుతుందా! శాస్త్రాల అంతరార్థాన్ని అవగాహన చేసుకోలేదని తేలిపోతున్నది గదా! వేదాలు, తంత్రాలు, షడ్దర్శనాలు చదవడం వల్ల, విషయం తెలుసుకోవడం వల్ల మాత్రమే భగవంతుడిని తెలుసుకోలేం. వాటితో భగవత్ అనుభూతి కలుగదు. కావలసింది తీవ్ర వైరాగ్యం, ఆధ్యాత్మిక సాధన మాత్రమే!' అని తత్వాన్ని విశదీకరించారు పరమహంస.

... డా॥ వెలుదండ సత్యనారాయణ

కృతజ్ఞతలు

చికాగోలో ఓ అతిథి ఇంట్లో స్వామి వివేకానంద బస చేసి ఉన్నారు. ఆయన నగరంలో ఉన్నాడని అక్కడి ధనికుల్లో ఒకడైన రాక్‌ఫెల్లర్‌కి తెలిసింది. స్వామిని కలుసుకోవడానికి ఓరోజు ఆర్భాటంగా ఆ ఇంటికి వెళ్లాడు. తన రాక గురించి తెలిసి వివేకానంద ఎదురు వచ్చి ఆహ్వానం పలుకుతాడని భావించాడు రాక్‌ఫెల్లర్. కానీ, ఎవరూ బయటికి రాలేదు. రాక్‌ఫెల్లర్ లోపలికి వెళ్లి చూడగా.. వివేకానంద ఏదో రాసుకుంటూ కనిపించారు. ఆయనకు ఇంకా మండిపోయింది. ఆవేశంతో 'నేనెవరో తెలుసా? ఈ నగరంలో అత్యంత సంపన్న వ్యక్తిని' అన్నాడు. అప్పుడు వివేకానంద 'మీకు అవసరానికి మించి సంపద వచ్చిందంటే అది మీది కాదని అర్థం. భగవంతుడు లోక హితార్థం ఆ ధనాన్ని మీ దగ్గర దాచి ఉంటాడు. ఆ సత్యాన్ని తెలుసుకొని లోక హితానికి పాటుపడండి' అన్నారు రాసుకుంటూనే!



రాక్‌ఫెల్లర్ అహం దెబ్బతిన్నట్టయింది. ఇంతవరకు ఆయనకు ఇలాంటి అనుభవం ఎదురుకాలేదు. అక్కణ్నుంచి చరచరా వెళ్లిపోయాడు. ఇంటికి వెళ్లినా వివేకానందుడి మాటలే ఆయన చెవుల్లో మార్మోగాయి. వారం గడిచింది. ఓ పెద్ద సంస్థకు భూరి విరాళాన్ని ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు రాక్‌ఫెల్లర్. అందుకు సంబంధించిన పత్రాలతో వివేకానందస్వామి దగ్గరికి వెళ్లాడు. గతంలో లాగే రాజసంగా ఆయన గదిలోకి అడుగుపెట్టాడు. తాను తెచ్చిన పత్రాలను వివేకానందకు చూపుతూ 'ఇదిగో ఇంత సంపద విరాళంగా ఇస్తున్నందుకు మీరు నాకు కృతజ్ఞతలు చెప్పాలి' అన్నాడు. అప్పుడు వివేకానంద 'నేను మీకు కాదు, మీరే నాకు కృతజ్ఞతలు చెప్పాలి. మీ జీవన దృక్పథాన్ని మార్చినందుకు!' అన్నారు. ఆ మాటలతో రాక్‌ఫెల్లర్‌కు వివేకానంద తత్వమేంటో అర్థమై మనసులోనే ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకొన్నాడు.

... మనోజ్ఞ